# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 129

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శనివారం 30 మే 2026







2వ పేజీలో...




2వ పేజీలో...

## బడిబాటపై పాటల సీడీ ఆవిష్కరణ



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న వనరులు, నాణ్యమైన విద్య, విద్యార్థుల నమోదు, విద్యా ప్రమాణాలు, మౌలిక సౌకర్యాలు, జీవన నైపుణ్యాలు, క్రీడలు, యోగ, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో రూపొందించిన "బడిబాట" పాటల సీడీని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ఈ సీడీని ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తిరుమల నాగేంద్ర కుమార్ రచించిన ఈ పాట ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను ప్రతిబింబించేలా రూపొందించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, విద్యార్థుల కలలు, విద్య విలువను అద్భుతంగా ప్రతిబింబించేలా ఈ పాట రచించబడిందని ప్రశంసించారు. ప్రతి పాఠశాలలో ఈ పాటను విద్యార్థులకు వినిపిస్తూ, విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా విద్యాధికారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. మురళీకృష్ణ, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎన్. విజయకుమార్ పాల్గొన్నారు. పాట రచయిత తిరుమల నాగేంద్ర కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## తెలంగాణ రైతుల కృషితోనే ఈ అగ్రస్థానం: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** ది ఆయిల్ మిషన్ ఆన్ ఎడిబిల్ ఆయిల్- ఆయిల్ పామ్ అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. జాతీయ ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ వాటా 36 శాతంగా నమోదయిందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2021-2026 మధ్య దేశంలో 2.73 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు అయిందని తెలిపారు. అందులో 98,112 హెక్టార్లతో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రైతుల కృషితోనే ఈ అగ్రస్థానం సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని చెప్పారు. 79,448 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రైతులకు ఎకరాకు రూ.2 నుంచి 3 లక్షల వార్షిక ఆదాయం అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు. ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు (FFBs) రూ.23,501/ మెట్రిక్ టన్ను గిట్టుబాటు ధరగా ఉందని తెలిపారు. దిగుమతి సుంకం పెంపుతో ధర రూ.25,000 వరకు పెరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే 3 ప్రాసెసింగ్ మిల్లులు, మరో 7 నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. 2026-27లో అదనంగా 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధి ప్లస్ గ్రామీణ ఉపాధి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి TG ECET 2026 ఫలితాలను అధికారికంగా విడుదల చేసింది. 2026 మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ (మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ecet.tgche.ac.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

**సమయం ప్రతినిధి:** మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి-చింఛ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు.






# సంపాదకీయం

## మోదీ సర్కార్‌కు 'బొద్దింకల' బెదురు!

సర్వవ్యాపక జీవి బొద్దింక మన రాజకీయ పరిభాషలో భాగం కావడానికి చాలా కాలం ముందే అది నా పాత్రికేయ పదావళిలో ఒక భాగంగా ఉండేది. జర్నలిజంపై నా ప్రసంగాలలో నేను తరచు పాత్రికేయులను బొద్దింకలతో పోల్చుతూ ఉండేవాణ్ణి. ఎందుకు? రేపు, ప్రపంచం ఒక మహా అణ్వాయుధ దాడికి (అది సంభవించకుండా ఉండుగాక) గురైతే బతికి బయటపడే జీవి బొద్దింక ఒక్కటే కదా. మానవాళి విధ్వంసాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా నివేదించేందుకు ఎవరో ఒకరు తప్పనిసరిగా అవసరమవుతారు. ఆ ఎవరో ఒకరు పాత్రికేయులు కాక మరెవరు?

సమాజ సమస్యలను పరిష్కరించడంలో దేశ రాజకీయ వ్యవస్థ ఘోర వైఫల్యం పట్ల పెల్లుబుకుతోన్న ఆగ్రహావేశాలను 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆకస్మిక ఆవిర్భావం నిండుగా ప్రతిబింబించింది. పాలనను అవినీతిమయం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహరిస్తున్న భయానక అంధకారాన్ని ఎత్తిచూపేందుకు మురికి తావుల్లో నడయాడే కీటకం బొద్దింకను నిరసనకారులు ఒక ప్రతీకగా తీసుకున్నారు. పాలకులు అంతకంతకూ చక్రవర్తుల్లా ప్రవర్తిస్తున్న ఒక రాజకీయ విశ్వంలో మనం ఉన్నాం. అధికారాలను విచక్షణారహితంగా చెలాయిస్తున్న పాలకులను గట్టిగా ఎదుర్కోలేనిరీతిలో ప్రతిపక్షం చీలిపోయి ఉన్న రాజకీయ విశ్వమది. ఈ వికృత రాజకీయ విశ్వంలోకి బొద్దింక పాకుకుంటూ వచ్చింది.

అసహ్యకరమైన కీటకాన్ని చిహ్నంగా స్వీకరించిన ఒక అసాధారణ వ్యంగ్య నిరసన ఉన్నపాటున ఒక ఉద్యమంగా పరిణమించింది. సుదూర అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక అజ్ఞాత రాజకీయ సందేశ వ్యూహకర్త ఈ ఉద్యమాన్ని ఆరంభించి భారతదేశ అధికార నడవాలలో ప్రకంపనలు సృష్టించాడు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన (పూర్తిగా అనవసరమైన) 'బొద్దింక' వ్యాఖ్యలు పురికొల్పిన ఆన్‌లైన్ వేలం వెర్రి ప్రపంచ అతి పెద్ద రాజకీయ పార్టీ, మహాశక్తిమంతమైన భారత రాజ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపరిచింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా 'కొంతమంది యువకులు ఉద్యోగాల్లేక, చేస్తున్న పనిలో గుర్తింపు లేక బొద్దింకల్లా అన్ని చోట్లకు విస్తరిస్తున్నారు. వారు మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థలపై దాడి చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక డిజిటల్ తిరుగుబాటుకు దారి తీశాయి. ఆగ్రహం ఆ తిరుగుబాటును ఉసిగొల్పగా వ్యంగ్యం దానికి అసాధారణ శక్తినిచ్చింది.

సీజేపీ ఒక రాజకీయ పార్టీ కూడా కాకపోవడం ఈ బొద్దింకల ఉద్యమాన్ని మరింత ఆకర్షణీయమూ, ఆసక్తిదాయకమూ చేస్తోంది. దానికొక నాయకుడు లేడు, ఇంచుమించు 150 కోట్ల ప్రజలతో అపార వైవిధ్యాలతో అలరారుతున్న దేశంలో చాలావరకు సైబర్ స్పేస్‌లోనే జరుగుతున్న ఉద్యమం యథాతథ పరిస్థితులకు ముప్పు కాబోదు. అయినా నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనా వ్యవస్థ సీజేపీ గురించి ఎందుకు అంతగా ఆందోళన చెందుతోంది? విదేశీ నిధులతో జరుగుతున్న ఉద్యమమని సీజేపీని మోదీ ప్రభుత్వ మంత్రులు విమర్శించారు. దాని అనుయాయుల్లో చాలా మంది పాకిస్థాన్‌లో ఉన్నారని మోదీ సర్కార్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు అవరోధాలు కల్పించారు. వాటిని తమ ఆన్‌లైన్ దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు సీజేపీ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ పరోక్ష ప్రమేయమున్నదని పలువురు ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమాలలో పనిచేసినవాడు కావడమే ఆ ఆరోపణకు ఆధారం. అధికారపక్షంలో ఈ ఆందోళనకు నాలుగు కారణాలు ఉన్నాయి. మొదటిది–తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయ కథనాల నియంత్రణపై పెద్ద ఎత్తున ఆధారపడిన ప్రభుత్వం మోదీ సర్కార్. దాని పాలన రేయింబవళ్ల వాణిజ్య ప్రచారంలా సాగుతోంది: విజయాలను ఘనంగా చెప్పుకోవడం, వైఫల్యాలను పూర్తిగా కప్పిపుచ్చడం, సరికొత్త నినాదంతో ముందుకు సాగడం. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి ఒక స్వప్నంగానే మిగిలిపోయింది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావడమనేది జరగనే లేదు. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఆగనే లేదు. అయినా ప్రభుత్వ అధ్వాన పనితీరును పాలకుల కథనాలు పూర్తిగా కప్పిపుచ్చుతున్నాయి. అయితే ఇంటర్నెట్ బొద్దింకలు ఈ ప్రభుత్వ కథనాలను విశ్వసించేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఈ తిరస్కారమే ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరుస్తోంది. రెండోది–యువత ఆగ్రహం. ఎన్నికలలో జయాపజయాలను అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. జీడీపీ అంకెలు పతాక శీర్షికలవుతున్నాయి. జాతీయవాద భావోద్వేగాలు ఉధృతమవుతున్నాయి. అయినా ఒక అంతులేని అభద్రతా భావంతో నేటి తరం సతమతమవుతోంది. లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. పరీక్షల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి అస్తుబిస్తుగా ఉన్నది. యువ భారతీయులలో నెలకొన్న అసంతృప్తి నైరాశ్యంలోకి జారిపోతోంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు శ్రద్ధ చూపడం లేదన్నది యువత ప్రధాన ఆరోపణ. వారి ఆగ్రహం భావజాలపరమైనది మాత్రమేకాదు, పూర్తిగా వ్యక్తిగతమైనది కూడా. ఇది ఇటీవలి ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. ముఖ్యంగా తమిళనాడులో విజయ్ రాజకీయ సంచలనంలో సంప్రదాయ రాజకీయాల పట్ల యువ ఓటర్ల అసహనం పూర్తిగా ప్రతిబింబించింది. దేశవ్యాప్తంగా యువ ఓటర్లు అంతకంతకూ కాలం చెల్లిన రాజకీయ ద్వంద్వాల –వామక్షాలు వర్సెస్ మితవాద పక్షాలు, ఉన్నత వర్గం వర్సెస్ ప్రజాకర్షక వాదం,–ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. భవితనిచ్చే నవ్యత, వాస్తవికత, భావోద్వేగ బాంధవ్యాలకోసం వారు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా విశాల, విస్తృత సమూహాలను సమీకరించే మీమ్ సంస్కృతి వారి నిరసనను వ్యక్తం చేసే భాషగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీకి ప్రాణవాయువుగా ఉన్న ఈ మీమ్ సంస్కృతి, బహుశా ఆ పార్టీకి సంబంధించి చాలా తక్కువగా అర్థం చేసుకున్న విషయమని విశదమవుతుంది.

## వందేమాతరంపై మళ్లీ రగడ.. కేరళ గవర్నర్ అసంతృప్తి

మొదటి పేజీ తరువాయి

తిరువనంతపురం: కేరళ రాజకీయాల్లో మరోసారి 'వందేమాతరం'పై వివాదం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) పాలసీ అడ్రస్ సందర్భంగా అసెంబ్లీలో 'వందేమాతరం' గేయాన్ని పూర్తిస్థాయిలో పాడకపోవడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ శుక్రవారంనాడు అసంతృప్తి వ్యక్తం చేసారు. అసెంబ్లీ నుంచి బయటకు వస్తూ మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో గవర్నర్ ఎప్పుడు హాజరైనా సరైన ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుందని అన్నారు.

కేరళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ముందు, తరువాత ఒక బ్యాండ్ టీమ్ 'వందేమాతరం' గేయంలోని మొదటి చరణాలను మాత్రమే ప్లే చేసింది. దీనిపై గవర్నర్ మాట్లాడుతూ, గవర్నర్ ఎప్పుడు హాజరైనా వందేమాతర గేయాన్ని పూర్తిగానే పాడాల్సి ఉంటుందని అన్నారు. 'గేయాన్ని ఆలపించలేదు, ప్లే మాత్రమే చేశారు' అని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తిరువాంచూర్ రాధాకృష్ణన్‌తో తాను ఇప్పటికే మాట్లాడానని, ఏం జరుగుతోందో చూద్దామని అన్నారు.

### గవర్నర్‌ను అవమానించడమే..

కాగా, ప్రభుత్వ విధానాలపై గవర్నర్ శుక్రవారంనాడు ప్రసంగించిన సమయంలో వందేమాతరం గేయాన్ని పూర్తిస్థాయిలో ఆలపించకపోవడాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది లోక్‌భవన్, గవర్నర్‌ను అవమానపరచడమేనని పేర్కొంది. గవర్నర్ ఎప్పుడు హాజరైనా జాతీయగేయం వందేమాతరాన్ని పూర్తి స్థాయిలో వినిపించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత, కాలకూట్టం ఎమ్మెల్యే వి.మురళీధరన్ తెలిపారు. అయితే కేరళ ప్రభుత్వం కేంద్రం ఆదేశాలను పాటించలేదన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సమయంలో ఇలా చేయడం జాతీయగేయానికే అవమానమని విమర్శించారు. వీడీ సతీశ్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం జమాతే ఇస్లామీ, సీపీఎం అభిప్రాయాలకు తలొగ్గుతోందని ఆరోపించారు. జాతీయగేయం సెక్యులర్ లైన్స్‌లో లేదంటూ ఆ పార్టీలు చేస్తున్న వాదనతో ప్రభుత్వం ఏకీభవించినట్టు స్పష్టమవుతోందని అన్నారు.

## జూన్ 1న డీకే ప్రమాణస్వీకారం.. సిద్ధరామయ్య తనయుడికి డిప్యూటీ సీఎం!

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనుండటం ఖాయమైంది. నాయకత్వ మార్పు నేపథ్యంలో తన కుమారుడు, ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని సిద్ధరామయ్య కోరినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కీలకమైన సీఎల్‌పీ నేత ఎన్నిక శనివారంనాడు జరగనుంది. సీఎల్‌పీ నేతగా డీకే ఎన్నికైన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జూన్ 1న డీకే సర్కార్ ప్రమాణస్వీకారం చేయనుంది. అంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతారు.

కాగా, మంత్రివర్గ కూర్పుపై ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే పార్టీ అధిష్ఠానంతో వరుస సమావేశాలు జరుపుతున్నారు. ఈ సమావేశంలో సిద్ధరామయ్య తన డిమాండ్లను అధిష్ఠానం ముందుంచినట్టు చెబుతున్నారు. యతీంద్ర సిద్ధరామయ్యకు ఉపముఖ్యమంత్రి పదవిని సిద్ధరామయ్య ఆశిస్తున్నారు. దీనితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు కేజే జార్జి, జి.పరమేశ్వరలకు క్యాబినెట్‌లో చేటు కల్పించాలని సిద్ధరామయ్య కోరినట్టు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్ష పదవిని ఆశించడం లేదని ఆయన వివరించినట్టు తెలిసింది.

### రేపు సీఎల్‌పీ సమావేశం

కాగా, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం శనివారంనాడు జరుగనున్నట్టు మీడియాతో మాట్లాడుతూ శివకుమార్ తెలిపారు. కేంద్ర నాయకులు వస్తున్నారని, పార్టీ ఎమ్మెల్యేలంతా బెంగళూరులోనే ఉండాల్సిందని కోరామని ఆయన చెప్పారు.

### ఖర్గేను కలిసిన సిద్ధరామయ్య

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో సిద్ధరామయ్య కలిసారు. కర్ణాటక మంత్రులు ప్రియాంక్ ఖర్గే, కేసీ జార్జ్, యతీంద్ర సిద్ధరామయ్య ఆయన వెంట ఖర్గేను కలిసిన వారిలో ఉన్నారు. దీనికి మందు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, విపక్ష నేత రాహుల్ గాంధీని 10 జన్‌పథ్‌లో సిద్ధరామయ్య కలిసారు. మర్యాదపూర్వకంగానే కేంద్ర నేతలను సిద్ధరామయ్య కలిసినట్టు కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకు సిద్ధరామయ్య తన పదవికి గురువారంనాడు రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించేందుకు, మంత్రిమండలిని రద్దు చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ లాంఛనంగా అంగీకరించారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిందిగా సిద్ధరామయ్యకు గవర్నర్ సూచించారు.

## రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టౌర్నమెంట్

(సమయం ప్రతినిధి మక్తల్) : మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం రాంపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువకుల ఆధ్వర్యంలో క్రికెట్ టౌర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఇట్టి టౌర్నమెంట్ కార్యక్రమాన్ని నర్వ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, SI రమేష్ చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంబించడం జరిగింది. ఈకార్యక్రమంలో DCC జనరల్ సెక్రెటరీ నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి , మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నాగన్న గారి వివేకవర్ధన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు శరణప్ప , యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగన్నగారి నరసింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు,ూవీజ డైరెక్టర్ నరేష్ , స్థానిక ప్రజాప్రతినిధులు, మైనార్టీ యువకులు, పాల్గొన్నారు.



## మైలేజ్ మ్యాజిక్ కోసం రేవంత్ యత్నాలు

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతోంది. పరిపాలన పరంగా వేగంగా అడుగులు వేస్తున్నప్పటికీ ప్రచార మైలేజీ ఆశించిన స్థాయిలో రావడం లేదన్న ఆందోళన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పార్టీ అగ్రనేతల్లోనూ కనిపిస్తోంది. ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల కంటే, చిన్నపాటి విమర్శలు సోషల్ మీడియాలో ఎక్కువగా హైలైట్ అవుతుండటంతో దీన్ని అధిగమించేందుకు వ్యూహకర్త సునీల్ కనుగోలు సేవలను మరింత అధికారికంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి వచ్చినప్పటి నుంచి రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి కీలక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. అయితే, క్షేత్రస్థాయిలో ఈ పథకాల వల్ల లబ్ధి పొందుతున్న ప్రజల కంటే, చిన్నపాటి లోపాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్షాల సోషల్ మీడియా ప్రచారమే బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వం పని చేస్తోంది కానీ.. చెప్పుకోవడం లో విఫలమవుతోంది అన్న విమర్శ స్వయంగా పార్టీ అంతర్గత సమావేశాల్లోనే వ్యక్తమైంది. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు సరికొత్త ప్రచార వ్యూహానికి పదును పెడుతున్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో వ్యూహకర్త సునీల్ కనుగోలు పాత్ర అత్యంత కీలకం. ప్రస్తుతం ఆయన బృందం పార్టీ కోసం పని చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ పరంగా ప్రచార సమన్వయం లోపించిందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే సునీల్ కనుగోలును కేవలం పార్టీ వ్యూహకర్తగానే కాకుండా, ప్రభుత్వ అధికారిక సలహాదారుగా నియమించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరగడంతో పాటు, పథకాల సమాచారం ప్రజల్లోకి వేగంగా వెళ్తుందని ఆశిస్తున్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్‌ను బలంగా నిర్మించుకుంది. ఇప్పుడు అదే వ్యవస్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తోంది. దీన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ఐటీ వింగ్ కొంత వెనుకబడి ఉందన్నది కాదనలేని సత్యం. సునీల్ కనుగోలు పర్యవేక్షణలో ప్రచార వ్యవస్థను ప్రక్షాళన చేసి, ప్రభుత్వ విజయాలను డిజిటల్ మాధ్యమాల్లో వైరల్ చేయడంతో పాటు, ప్రతిపక్షాల విమర్శలను తక్షణమే తిప్పికొట్టేలా వార్ రూమ్ ను బలోపేతం చేయబోతున్నారు. ప్రభుత్వం భారీగా సంక్షేమ పథకాలకు నిధులు వెచ్చిస్తున్నా, ప్రజల్లో పెర్సెప్షన్ మార్చడంలో ప్రచారం లోపిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, లబ్ధిదారుల అభిప్రాయాలను వీడియోల రూపంలో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం, ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రచారం చేయించడం వంటి ఆధునిక పద్ధతులను సునీల్ కనుగోలు టీమ్ సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేలా ఇన్ఫోగ్రాఫిక్స్, షార్ట్ వీడియోలపై దృష్టి సారించనున్నారు. ప్రభుత్వానికి అనుకూలమైన గాలిని సృష్టించడమే సునీల్ కనుగోలు టీమ్ ముందున్న అసలైన టాస్క్. గతంలో కర్ణాటకలో పనిచేసిన అనుభవంతో, ఇక్కడ కూడా ప్రభుత్వానికి ఒక పాజిటివ్ ఇమేజ్ తీసుకురావాలని హైకమాండ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. పరిపాలనలో ఎంత వేగం ఉన్నా, అది ప్రజలకు చేరినప్పుడే రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుంది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం (మే 30) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో సాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష సమావేశం

### రేపు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీక్ష

నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రైస్ మిల్లులను సందర్శించి పరిస్థితిని పరిశీలించనున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.





# పి ఆర్ టి యు ఆధ్వర్యంలో 10 విద్యార్ధులకు అవార్డులను ప్రధానం చేసిన మంత్రి

(సమయం ప్రతినిధి నారాయణ పేట) : నారాయణపేటలో పీ ఆర్ టి యు ఆధ్వర్యంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఎస్సి లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంత్రి శ్రీహరి సన్మానించారు.మంత్రి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పి ఆర్ టి యు ఆధ్వర్యంలో అవార్డ్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రయివేట్ స్కూల్లలో కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే గురువులు నాణ్యమైన విద్య అందిస్తారన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత శాతంలో గతంలో కన్నా నారాయణపేట జిల్లా 19 నుండి 14 కు ఎగబాకింది. రాబోయే రోజుల్లో 1వ స్థానానికి రాణించేలా కృషి చేయాలని సూచించారు.గతంలో పాఠశాలలు తెరిచినా బుక్స్ ఆలస్యంగా వచ్చేవి. కానీ ఇప్పుడు స్కూల్ తెరిచిన వెంటనే బుక్స్,షూస్,బ్యాగులు ఇస్తున్నామని కాస్మోటిక్ చార్జెస్,డైట్ చార్జెస్ పెంచామని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అలాగే ఎస్ఎస్సి తర్వాత వచ్చే ఆరు సంవత్సరాలు ఉపాద్యాయుల తల్లిదండ్రుల మాట విని ఉన్నత స్థాయి కి ఎదగాలని ఈ రాష్ట్ర పౌరుల తలరాత మార్చే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లో ఉందన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలు ఫ్లెక్సీ లో పెట్టిస్తే మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యం తో పదోన్నతులు, బదిలీలు చేపట్టడం జరిగిందని




ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. వెనుకబడిన పాలమూరు జిల్లా నుండి వచ్చిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు కావున ఈ ప్రాంతంలో మక్తల్- నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామన్నారు.. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1.5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. తద్వారా ఆర్థిక స్థితిగతులు బాగుపడి విద్యావ్యవస్థ కూడా బాగుపడుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రాజెక్టు కట్టకముందే భూ నిర్వాసితులకు ఎకరాకు 20 లక్షల చొప్పున ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక,జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు పిఆర్టియూ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో మురుగు కంపు - బీజేపీ నేతల వినతి



(సమయం ప్రతినిధి గద్వాల) వడ్డేపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పైపాడ్‌లి ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ నాయకులు, ప్రజలు కలిసి వడ్డేపల్లి మున్సిపాలిటీ చైర్మన్ మంజుల కిడ కమిషనర్ చంద్రశేఖర్ రావు కి వినతి పత్రం అందజేశారు.

**ప్రధాన సమస్యలు:**

1. 10వ వార్డు, హాస్టల్ వీధి: మొత్తం లైన్ డ్రైనేజీ పూడికతో మూసుకుపోయి మురుగు, మూత్రం వాసనతో కంపుకొడుతోంది.
2. శ్రావణి ప్రింటింగ్ పక్కన రోడ్డు: వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. దీంతో దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వచ్చే ప్రమాదం ఉంది.
3. పైపాడు: తీవ్రమైన విద్యుత్ కోతలు, సరఫరా సమస్యలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బీజేపీ డిమాండ్లు:**

1. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను వెంటనే పటిష్టపరచాలి.
2. దోమల నివారణకు ప్రతి వీధిలో దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
3. పైపాడు విద్యుత్ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్, రాజశేఖర్ టౌన్ కార్యదర్శి బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో జాప్యం రైతులకు నష్టదాయకం

**వడ్ల శంకర్ ఆందోళన**



(సమయం ప్రతినిధి వనపర్తి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని బిజెపి సోషల్ మీడియా ఇంచార్జ్ వడ్ల. శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో రోజులు తరబడి ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాల వర్షాలు, ఎండల కారణంగా ధాన్యం తడిసిపోవడం, నాణ్యత తగ్గడం వలన రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు రాత్రింబవళ్లు ధాన్యం వద్దే కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వడ్ల.శంకర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతు సంక్షేమం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# మంత్రి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగిరెడ్డిపల్లి బిజెపి పార్టీ ఉపసర్పంచ్ మొగిలిన్న




**కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి శ్రీహరి**

(సమయం ప్రతినిధి మక్తల్) : మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమక్షంలో, మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో నర్వ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ బిజెపి పార్టీ ఉపసర్పంచ్ మొగిలిన్న,పొట్ల కొండన్న, గడ్డమీది మహేందర్,డి.శ్రీనివాసులు,ఆర్ నవీన్,ఆర్ ప్రతాప్,ముత్త పరమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో AMC వైస్ చైర్మన్ D.కృష్ణరెడ్డి, నాగిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అంకె భాగ్యమ్మ చంద్రశేఖర్, నర్వ గ్రామ సర్పంచ్ టి.హనుమంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరెడ్డి, AMC డైరెక్టర్ మార్కా నరేష్, నర్వ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు P.అశోక్ గౌడ్, నాగిరెడ్డిపల్లి గ్రామ యూత్ అధ్యక్షులు చెన్నారాయుడు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చల్లబడుతున్న వాతావరణం...

హైదరాబాద్ : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ, ఏపీలో వాతావరణం చల్లబడుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు కూడా ఒకట్రెండు రోజుల్లో ఎంటర్ కానుండటంతో వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే.. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో రాత్రి వాన కుమ్మేసింది. కొన్నిచోట్ల ఈదురుగాలు బీభత్సం, ఉరుములు, మెరుపులు భయపెట్టాయి. జూన్ 3,4 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళ తీరంలోకి ప్రవేశించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే రుతుపవనాలు లక్షద్వీప్‌నకు చేరుకున్నాయని.. వచ్చే వారంలో మరింత విస్తరిస్తాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 5-10 తేదీల్లో రుతుపవనాలు ప్రవేశిస్తాయని.. 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో పెను మార్పులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో వచ్చే మూడురోజులు రాష్ట్రంలో పొడి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిస్తాయని వివరించింది.ఇదిలాఉంటే.. ద్రోణి ప్రభావంతో శుక్రవారం మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రంలో ఎండల తీవ్రతతో పాటు కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఇవాళ.. 79 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 152 మండలాల్లో వడగాల్పుల ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఏపీ జిల్లాల్లో వానలు పడ్డాయంటే..**

ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా జిల్లా గుడివాడలో ఈదురుగాలులతో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం వరకు ఎండ మిడిసిపడగా.. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో గుడివాడ అంధకారంగా మారింది.విజయవాడ, మచిలీపట్నం, తిరువూరు, మైలవరం ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల బీభత్సంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై ఎక్కడికక్కడ విరిగిపడ్డ చెట్లు, కరెంట్ స్తంభాలు.తూర్పుగోదావరి జిల్లాలో ఈదురుగాలతో కూడిన భారీ వర్షం కురిసింది. రాజమండ్రిలో పలుచోట్ల ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. భారీ వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. రాజమండ్రి నగరమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా భారీ ఈదురుగాలులు అలజడి సృష్టించాయి. సాయంత్రం తర్వాత ఒక్కసారిగా వాతావరణం కూల్‌కూల్‌గా మారిపోయింది. ఈదురుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. హోర్డింగ్‌లు కొట్టుకుపోయాయి. ఈదురుగాలుల ప్రభావంతో అలర్ట్ అయిన అధికారులు ముందుగానే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పలు ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయిఅల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో పలుచోట్ల వర్షం పడింది.

# జడ్చర్లలో రూ.80 లక్షలతో నూతన ప్రభుత్వ పాఠశాల భవనానికి శంకుస్థాపన






**సమయం ప్రతినిధి, జడ్చర్ల :** జడ్చర్ల మండల పరిధిలోని బాదేపల్లి పాతబజార్ హరిజనవాడలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) భవనానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ పాఠశాల భవన సమస్యను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అనంతరం అరబిందో ఫార్మా యాజమాన్యంతో చర్చలు జరిపి, సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద నూతన పాఠశాల భవన నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి కార్పొరేట్ సంస్థ తమ లాభాల్లో రెండు శాతం నిధులను సామాజిక బాధ్యత కింద సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఈ నిధులను ఖర్చు చేస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి పునర్నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అరబిందో ఫార్మా సంస్థ రూ.4 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో భాగంగా బాదేపల్లిలో రూ.80 లక్షల వ్యయంతో నూతన పాఠశాల భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆమోదంతో పాత భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉరుకొండ మండలం గుడిగానిపల్లిలో రూ.1.20 కోట్ల వ్యయంతో మరో నూతన పాఠశాల భవన నిర్మాణానికి కూడా అరబిందో ఫార్మా సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇతర కార్పొరేట్ సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే భవిష్యత్తులో వారు ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మండల విద్యాధికారి మంజులాదేవి, అరబిందో ఫార్మా ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండి వెనక బండి కట్టి ఎ బండ్లో వస్తావు కొడుకో సర్కార్ నైజమోడా....

**విప్లవ గీతాలతో దొరల పెత్తనం గుర్తు చేసే గీతం,**
**నేడు మట్టి మాఫియా ను గుర్తు తెస్తుంది ...**
**నేడు గ్రామాల్లో ట్రాక్టర్ వెనక ట్రాక్టర్...**
**ఎన్ని ట్రాక్టర్ల మట్టి కావాలో పట్టపగలు సర్కార్ కు**
**సవాల్ విసురుతున్న మట్టి మాఫియా...**





**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మట్టి మాఫియా రెచ్చిపోతున్నారు. 13 మండలాల్లో సర్కార్ కు, మైనింగ్ అధికారులను మేనేజ్ చేస్తూ ఎదేచ్చగా మట్టిని తరిస్తూ ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్న చోద్యం చూస్తున్న అధికారులు, మల్దకల్ మండలంలో అమరవాయి, బిజ్వరం గ్రామాలకు రాత్రి అయిందంటే చాలు ధరూర్ మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ తో పాటు మన్నపురం కాల్వ మట్టిని మట్టి మాఫియా తోడేస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. అక్రమార్కులు మట్టినీ తరలిస్తున్న ప్రదేశానికి అధికారులు వెళ్ళితే అధికార పార్టీ నేతల నుండి అధికారులకు ఫోన్ వస్తదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రైతులు తమ ఇంటికి ఒక ట్రాక్టర్ మట్టి కొడితే రాయన్ అక్కడికి చేరుకొని నీకు అనుమతులు లేవని పోలీసు స్టేషన్ కు తరలించే ఖాకీలు, ట్రాక్టర్ వెనుక ట్రాక్టర్లతో మట్టిని తరలించి సొమ్ము చేసుకొంటున్న మట్టి మాఫియాను ప్రశ్నించపోవడానికి గల కారణాలు అందరికీ తెలిసినావే "ఇంద్ర" సినిమాలో సన్నివేశం జ్ఞాపకం వస్తుంది. నీకి ఇంత, నాకి ఇంత, నీకింత డబ్బులు పంచుకొనే సన్నివేశం గుర్తుకు వస్తుంది. అధికారులు చెప్పేవి శ్రీరంగ నీతులు దూరివే.... గుడిసెలు అన్నట్లు కొందరు అధికారులు ప్రవర్తించే తీరు విస్మయానికి గురి చేస్తాయి. నెల నెల ప్రభుత్వ వేతనం తీసుకుంటూ ప్రజల పక్షం ఉండే అధికారులు, రాజకీయ నాయకుల పక్షం వత్తాసు పలుకుతూ వన్యసంరక్షణను నడిగడ్డలో నాశనం చేస్తున్న మట్టి మాఫియా పై గట్టి చర్యలు తీసుకోవాలి. కుంటలు మొదలుకొని ఏకంగా నది జలాలను సైతం అక్రమార్కులు చేరబట్టే వరకు వచ్చింద్రు అంటే అధికారులు తీరు ఇట్లే తేట తెల్లం అవుతుంది. జిల్లా కలెక్టర్ స్పందించి మైనింగ్, పోలీస్, రెవిన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకోని వన్యాసం రక్షణ కాపాడాలని 13 మండలాల ప్రజలు కోరుతున్నారు.

## బక్రీద్ పర్వదినం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ**
**బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు**
**జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ముగిసిన పవిత్ర ప్రార్థనలు**



వనపర్తి : గురువారం రోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలనగర్ ఈద్గా మైదానం వద్ద బక్రీద్ పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు విధులను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పర్వదినాన్ని జిల్లా ప్రజలు పరస్పర సౌభ్రాతృత్వం, శాంతి సామరస్యాల మధ్య ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గా మైదానాల వద్ద పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించారని తెలిపారు. ప్రజల సహకారంతో జిల్లా అంతటా పవిత్ర ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని ఎస్పీ పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సిఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, సురేందర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ట్రెండింగ్ లో ఇథనాల్ కుకింగ్ స్టౌ...

ముంబై : పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో ఇంధన సంక్షోభం నెలకొంది క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. దీంతో దేశంలో పెట్రో ధరలు పెరుగుతున్నాయి. ఎల్పీజీ సరఫరా నిలిచిపోవడంతో వాటి ధరలను కేంద్రం పెంచింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లలో గ్యాస్ సరఫరా నిలిచిపోయి మూతపడుతున్నాయి. ఈ తరుణంలో ప్రయత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఇంధన రంగంలో కొత్త మలుపు రాబోతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఇటీవల ఇథనాల్ ఆధారిత కుకింగ్ స్టవ్‌లను ఎల్‌పీజీ సిలిండర్లకు ఆర్థికపరంగా మంచి ప్రత్యామ్నాయంగా సిఫార్సు చేశారు. దేశీయ ఇంధన వనరులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈ ప్రతిపాదన వచ్చింది. ఇథనాల్ స్టవ్‌లను ప్రోత్సహించడానికి యువతను ఆకర్షించేలా రూ.40 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించడం ఈ సూచనకు ఆచరణాత్మక బలం ఇస్తోందిఈ స్టవ్‌లో నీటిలో కేవలం 7 శాతం ఇథనాల్ కలిపితే సరైన మంట వస్తుందని గడ్కరీ తెలిపారు. సాధారణ ఎల్‌పీజీ స్టవ్‌లతో పోలిస్తే ఇందులో మసి, పొగ, కాలుష్యం ఏమీ ఉండదు. ఇథనాల్ సులభంగా లభ్యమవుతుంది మరియు దేశంలోని చక్కెర కర్మాగారాలు, మక్క ఉత్పత్తి నుంచి సులభంగా తయారు చేయవచ్చు. ఇప్పటికే ఈ స్టవ్‌లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి, కాబట్టి సాధారణ ప్రజలు సులభంగా ప్రయత్నించవచ్చు. ఎల్‌పీజీ సిలిండర్ ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో ఇథనాల్ స్టవ్ గృహిణుల ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న నర్వ మండలం



**(సమయం ప్రతినిధి మక్తల్):** నర్వ మండలంలోని లంకాల గ్రామం నుండి ఉంద్యాల వరకు 7 KM, 7,కోట్లు రూపాయతో బీటీ రోడ్ శాంక్షన్ కావడం జరిగింది. పంచాయతీరాజ్ అధికారులు లంకాల నుండి ఉంద్యాల వరకు రోడ్డు కొలతలు మరియు సర్వే చేయడం జరిగింది. బీటి రోడ్డు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని రోడ్డు శాంక్షన్ కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, పంచాయతీ రాజ్ A E ప్రవీణ్ కుమార్ గారు, మండల ఉపాధ్యక్షులు శరణప్ప గారు, మండల కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి నరేష్ గారు,గ్రామ వార్డు మెంబర్లు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసం బాలరాజు గారు,GK మూర్తి,కృష్ణ,బుడ్డన్న,టైలర్ శ్రీను, సాలె గోవిందు, బైని శ్రీను, కురుమూర్తి, గ్రామ యువకులు, ప్రజలు,తదితరులు పాల్గొనడం జరిగింది.

# మట్టిలో మాణిక్యాన్ని వెలికి తీయడమే సీఎం లక్ష్యం : మంత్రి శ్రీహరి









(సమయం ప్రతినిధి షాద్ నగర్) : క్రీడాకారులకు క్రమశిక్షణ చాలా అవసరమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.షాద్నగర్ కేశంపేట గ్రామంలో ఎడ్యుకోజ్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ ఫుట్బాల్ టోర్నమెంట్ 2026 బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు.ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ....అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులను రాణించే విధంగా ఎడ్యుకొజ్ అకాడమీ వారు ఫుట్బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినం దనీయమన్నారు.క్రీడలు ఆడే విద్యార్థులు అతికొద్ది మంది ఉన్నా కూడా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మట్టిలో మాణిక్యాన్ని వెలికి తీసే విధంగా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చారని గుర్తు చేశారు. మత్తు వదలి మైదానాలు చేరాలన్న నినాదం తో ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు.క్రీడలు టైం పాస్ కు ఆడవద్దని క్రీడాకారులకు హితవు పలికారు. క్రీడల పట్ల క్రీడా కారులకు క్రమశిక్షణ ఉండాలన్నారు.ప్రపంచాన్ని మరచిపోయి ఆడితే ప్రపంచం మీ వైపు చూస్తుందని హితభోద చేశారు.

# రైతు గోస - బీజేపీ భరోసా



(సమయం ప్రతినిధి వనపర్తి) : రాష్ట్ర భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకులిరైతు గోసలి బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు జిల్లా మాజీ అధ్యక్షులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర బిజెపి కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దాబా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి మాట్లాడుతూ నిన్న మొన్న కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని నెల రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని,తూకాలు అయిన దాదాపు 80 వేల బస్తాలు తరలించకుండా కేంద్రంలోనే పేరుకుపోయిన విషయాన్ని పరిశీలించి, భారతీయ జనతా పార్టీ రైతన్నలకు అండగా ఉంటుందని, ఇట్టి నిర్లక్ష్య వైఖరిని,ఫోన్ ద్వారా కలెక్టర్ ఆఫీసుకు సివిల్ సప్లై డిఎస్ఓ ఆఫీస్ కు సమాచారం ఇచ్చి వెనువెంటనే ఇక్కడి ధాన్యాన్ని తరలించుటకు లారీలు పంపించాలని డిమాండ్ చేయడం జరిగింది. అధికారులు కూడా వెంటనే స్పందించి అక్కడి నుంచి వరి ధాన్యాన్ని త్వరగా గోదాములకు పంపుతామని హామీ ఇచ్చారు.రైతన్నల పరిస్థితి చూస్తూ ఈ ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తే మాత్రం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబు గౌడ్, మండల మాజీ అధ్యక్షులు ఎస్ కృష్ణ యాదవ్, మండల నాయకులు వడ్డే రాజు, నితిన్ యాదవ్, చంద్రయ్య గౌడ్, తోపాటు గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# అధిక చెరుకు దిగుబడినిచ్చే వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కృష్ణవేణి రైతులు






(సమయం ప్రతినిధి కొత్తకోట): శుక్రవారం నాడు స్థానిక కృష్ణవేణి పరిశ్రమ రైతులు సిబ్బంది కలిసి సంయుక్తంగా కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం జిల్లా గోకాట్ తాలూకాలోని కల్లోలి గ్రామంలో బాలప్ప బేలకూడు అనే రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు బాలప్ప బేలకోడు తాను 3, ఎకరాల్లో 390 టన్నులు ఎకరానికి 130 టన్నులు పండించిన రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన రైతులకు తెలపడం జరిగింది.బాలప్ప రైతు తాను ఎకరములో 130 టన్నులు వర్మి డి కంపోస్ట్ ఫర్టిలైజర్ వాడే విషయాల్ని మెలకువలు రైతులకు చెప్పారు.బాలప్ప అనే రైతు ఏఐ టెక్నాలజీ ద్వారా 5, ఎకరాల్లో వెయ్యి టన్నులు, ఎకరంలో 200 టన్నులు,పండించాలని 5 ఎకరాల భూమిని సిద్ధం చేసినాడు, బాలప్ప బెలకోడు రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కృష్ణవేణి సిబ్బందిలో అమరచింత నర్వ ఏరియా మేనేజర్లు రాములు హేమాద్రి, కృష్ణవేణి పరిశ్రమ చెరుకు రైతు సంఘం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు రాజన్న ప్రధాన కార్యదర్శి జి రవి సహాయ కార్యదర్శి టి వీరన్న ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు తిరుపతయ్య బి రాజు రవీందర్ రెడ్డి రామకృష్ణ రామ్ రెడ్డి వెంకటేష్ వి విష్ణు వర్ధన్ కురుమన్న రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సన్నద్ధతపై విత్తన డీలర్ల సమావేశం






సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ : ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధంగా విత్తన డీలర్లతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం శుక్రవారం మహబూబ్‌నగర్ రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు బి. రాంపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని డీలర్లకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సన్నారకాలతో పాటు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సీడ్ నివేదికలు, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డు నిర్వహణపై డీలర్లకు అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి కలిగే నష్టాలను వివరించారు. రైతులు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వివిధ రకాల పంటల విత్తనాలను అందుబాటులో ఉంచేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అదేవిధంగా ఎరువుల బుకింగ్ యాప్‌కు సంబంధించిన డీలర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్, కోయిల్‌కొండ మండల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వేగవంతం

### జూన్ 1న విచారణకు హాజరుకానున్న ఎమ్మెల్యే యెన్నం

(సమయం ప్రతినిధి మహబూబ్నగర్):ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి అధికారులు నోటీసులు జారీ చేశారు. జూన్ 1వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ అంశంపై మొదటగా డిజిపికి ఫిర్యాదు చేసిన వారిలో యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముందున్నారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. తదనంతరం మరికొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా కేసు వేగం పుంజుకుంది. ప్రస్తుతం విచారణ వేగవంతం కాగా, జూన్ 1న యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారుల ముందు హాజరై తన వాంగ్మూలాన్ని ఇవ్వనున్నారు.

## బోర్డర్ లో ఫుల్ సెక్యూరిటీ...

కోల్ కత్తా : ఒక దేశంలో అంతర్గత భద్రత పటిష్టంగా ఉంటేనే .. అక్కడి ప్రజలకు మెరుగైన జీవనం లభిస్తుంది. అలాకాకుండా అంతర్గత భద్రత ఇబ్బందికరంగా ఉంటే ప్రజల పరిస్థితి దారుణంగా ఉంటుంది. గతంలో మన దేశంలో అంతర్గత భద్రత అంత గొప్పగా ఉండేది కాదు. ముఖ్యంగా బిఎస్ఎఫ్ ఆధీనంలో ఉన్న 15 రాష్ట్రాలలో చొరబాట్లు ఉండేవి. ఫలితంగా ఆయుధాలు అక్రమంగా మనదేశంలోకి రవాణా అయ్యేవి. నకిలీ నోట్లు, మాదకద్రవ్యాలు వచ్చేవి. దీనివల్ల దేశంలో ఆందోళనకర పరిణామాలు చోటు చేసుకునేవి.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బంగ్లాదేశ్ నుంచి భారీగా వలసలు ఉండేవి. మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశ్ ప్రజలకు మన దేశ పౌరసత్వం లభించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అస్సాం.. త్రిపుర రాష్ట్రాలలో కూడా బంగ్లాదేశ్ ప్రజలకు మన దేశ పౌరసత్వం సులభంగానే లభించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాలలో ఒక్క మతానికి సంబంధించిన జనాభా అధికంగా పెరుగుతున్నట్టు కేంద్రం గుర్తించింది. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా సరిహద్దు కలిగి ఉన్న రాష్ట్రాలలో ఒక మతానికి సంబంధించిన జనాభా అధికంగా పెరుగుతోందని.. దీనివల్ల సంక్షేమ పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కష్టమవుతుందని వ్యాఖ్యానించారు. ఆయన మాటలను చాలామంది తేలికగా తీసుకున్నారు.ప్రధానమంత్రి ఆ మాటలను ఇప్పుడు క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రంగంలోకి దిగి మనదేశంలో ఉన్న 15 రాష్ట్రాల సరిహద్దులను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ ఏకంగా కంచెలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతేకాదు ఒక హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు.



## రిషభ్ పంత్ ఔట్..

స్పోర్ట్స్ డెస్క్: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఈ సీజన్‌లో లఖ్‌నవూ కు సారథ్యం వహించిన రిషభ్ పంత్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఫ్రాంఛైజీ 'ఎక్స్' వేదికగా ప్రకటన చేసింది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఘోరంగా విఫలమైన సంగతి తెలిసిందే. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది.

కెప్టెన్సీ బాధ్యతల నుంచి ఉపశమనం కల్పించాలన్న పంత్ అభ్యర్థనను తాము అంగీకరించినట్లు ఎల్ఎస్‌జీ తెలిపింది. 'కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ మర్యాదపూర్వకంగా అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి బాగా సేవలందించాడు' అని రాసుకొచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టును అత్యుత్తమ ప్రమాణాలతో పునర్నిర్మించడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపింది. 2025 ఐపీఎల్ మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఫ్రాంఛైజీ ఏకంగా రూ.27 కోట్లతో దక్కించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. బ్యాటింగ్ పరంగానూ పంత్ ఆకట్టుకోలేకపోయాడు. గత సీజన్‌లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది మొత్తంగా 312 పరుగులు సాధించాడు.



## కేన్ ప్రపంచ రికార్డ్

స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 విభిన్న దేశాలలో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా వారిద్దరూ రికార్డులెక్కారు. ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బెల్‌ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 5 వికెట్ల నష్టానికి 361 పరుగుల భారీ స్కోర్ సాధించింది. క్రీజులో టామ్ బ్లండెల్(142), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్(38) ఉన్నారు. అంతకంటే ముందు రచిన్ రవీంద్ర(121) సెంచరీతో సత్తాచాటాడు.

ఈ మ్యాచ్‌తో కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు 12 విభిన్న దేశాలలో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా రికార్డు సృష్టించారు. వీరికంటే ముందు ఈ ఇద్దరు ఆటగాళు 11 దేశాలలో టెస్ట్ మ్యాచ్‌లు ఆడి షేన్ వార్న్, క్రిస్ గేల్, శివనారాయణ్ చందర్‌పాల్‌లతో పాటు పలువురు పాకిస్థాన్ దిగ్గజ ఆటగాళ్లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండేవారు. కానీ ఈ మ్యాచ్‌లో వారిందరిని కేన్, లాథమ్ అధిగమించారు. ఈ మ్యాచ్‌లో విలియమ్సన్ 36 పరుగులు చేసి పర్వాలేదనిపించగా... టామ్ లాథమ్ మాత్రం ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. విలియమ్సన్ 2010లో భారత్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అరంగ్రేటం చేశాడు. తన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడి కెప్టెన్సీలో కివీస్ తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(2021) టైటిల్‌ను సొంతం చేసుకుంది. విలియమ్సన్ ఇప్పటివరకు 109 టెస్టుల్లో 9,497 పరుగులు చేశాడు. లాథమ్ విషయానికి వస్తే..ఇప్పటివరకు 92 టెస్టులు ఆడి.. 16 సెంచరీలు, 31 అర్ధసెంచరీలతో 6,261 పరుగులు సాధించాడు.



## ఎవరిదో ఆఖరి అడుగు?

మొదటి పేజీ తరువాయి

**విజేత ఫైనల్‌కు..**

ముల్లన్‌పూర్: ఐపీఎల్-19వ సీజన్ ఫైనల్‌కు ముందు చిట్టచివరి ప్లేఆఫ్స్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గుజరాత్ టైటాన్స్-రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య శుక్రవారం క్వాలిఫయర్-2 జరుగనుంది. ఈనెల 31న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగే ఫైనల్లో తలపడేందుకు ఇరు జట్లకిదే ఆఖరి అవకాశం. రాజస్థాన్ 2008 ఆరంభ సీజన్‌లో విజేతగా నిలవగా.. ఆ తర్వాత 2022లో మాత్రమే ఫైనల్‌కు రాగలిగింది. ఆ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలోనే పరాభవం ఎదురుకాగా.. నేడు ఆర్ఆర్‌కు బదులు తీర్చుకునే సమయం వచ్చింది. ఇక క్వాలిఫయర్ 1లో పేలవ ఆటతీరుతో ఆర్‌సీబీ చేతిలో చిత్తుగా ఓడిన టైటాన్స్‌కిది రెండో అవకాశం. ఇరు జట్లు ఓవరాల్‌గా 10 మ్యాచ్‌ల్లో తలపడగా 7-3తో గిల్ సేన ఆధిపత్యంలో ఉంది. ఈ సీజన్‌లో చెరో మ్యాచ్ గెలిచాయి. ఏదిఏమైనా ఇదే మైదానంలో 29 బంతుల్లో 97 పరుగులు బాదిన వైభవ్‌ను టైటాన్స్ బౌలర్లు ఏమేరకు నిలువరిస్తానేది ఆసక్తికరంగా మారింది.

**దూకుడు పెంచాల్సిందే..** ఫైనల్‌కు దూసుకెళ్లాలంటే గుజరాత్ ఓపెనర్ల నుంచి మెరుపు ఆరంభం రావాల్సి ఉంటుంది. సాయి సుదర్శన్-శుభ్‌మన్ గిల్ నిలకడకు మారుపేరైనా.. వీరి ఆటలో టీ20 తరహా హిట్టింగ్ కనిపించదు. శుక్రవారం ఆ బలహీనతను అధిగమించాల్సి ఉంటుంది. క్వాలిఫయర్1లో టాపార్డర్ పూర్తిగా విఫలం కావడం దెబ్బతీసింది. తెవాటియాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపితే ప్రయోజనం ఉంటుంది. మిడిలార్డర్‌లో అండగా నిలిచే బ్యాటర్ లేకపోవడం లోపంగా కనిపిస్తోంది. జట్టు బౌలింగ్ మాత్రం పకడ్బందీగానే ఉంది. ఆర్‌సీబీపై తేలిపోయినా.. ఓవరాల్‌గా వీరి ప్రదర్శన అద్భుతంగానే ఉంది. పేసర్ రబాడ (26), సిరాజ్ (17) స్పిన్నర్ రషీద్ ఖాన్ (19) ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలరు. ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్ రాణిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. కానీ నేటి మ్యాచ్‌లో వైభవ్‌ను వీరంతా ఏమేరకు నిలువరించగలరనే దానిపైనే విజయావకాశాలుంటాయి.

**జోష్‌లో రాజస్థాన్**

ఎలిమినేటర్‌లో పటిష్ట సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన జోష్‌లో రాజస్థాన్ కీలక మ్యాచ్‌కు సిద్ధం కానుంది. ఎప్పటిలాగే చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీపైనే జట్టు ఆధారపడి ఉంది. పవర్‌ప్లేలోనే తను మ్యాచ్‌ను శాసిస్తున్నాడు. కానీ అతడి జోరును అందుకోవడంలో మిగతా బ్యాటర్లు విఫలమవుతున్నారు. బుధవారం ఓ దశలో ఆర్ఆర్ 280 రన్స్ చేస్తుందని ఆశించారు. కానీ చివరకు 250 కూడా చేయలేకపోవడం గమనార్హం. జురెల్ మినహా మిగతా బ్యాటర్లు తడబడ్డారు. వైభవ్ సునామీ ఇన్నింగ్స్ లేకపోతే జట్టు కచ్చితంగా నిష్క్రమించేదే. అయితే తాజా సీజన్‌లో గుజరాత్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో తను 31, 36 పరుగులు మాత్రమే చేయడం ఆందోళనకరమే. సిరాజ్, రబాడ అతడిని అడ్డుకోగలిగారు. అందుకే వైభవ్‌పైనే ఆధారపడకుండా ఓపెనర్ జైస్వాల్, కెప్టెన్ పరాగ్, ఫెరీరా, షనక బ్యాట్లు ఝుళిపించాల్సిందే. బౌలింగ్‌లో పేసర్ ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీస్తూ కీలకంగా నిలుస్తున్నాడు. బర్గర్ తనకు తోడుండగా.. మధ్య ఓవర్లలో బ్రిజేశ్, యష్ రాజ్, జడేజా ప్రత్యర్థిని కట్టడి చేస్తున్నారు. ఫైనల్ చేరే క్రమంలో ఈ చివరి అడ్డంకిని స్థాయికి తగ్గ ఆటతీరుతో అధిగమించాలని రాయల్స్ భావిస్తోంది.

**తుది జట్లు**

గుజరాత్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, నిశాంత్, సుందర్, హోల్డర్, తెవాటియా, రషీద్, రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్.

రాజస్థాన్: వైభవ్, జైస్వాల్, జురెల్, పరాగ్ (కెప్టెన్), ఫెరీరా, షనక, జడేజా, ఆర్చర్, బర్గర్, సుశాంత్, బ్రిజేశ్, యష్ రాజ్.

**పిచ్:** వికెట్‌పై చక్కటి బౌన్స్ ఉండడంతో ఆరంభంలో వేగంగా పరుగులు వచ్చే అవకాశం ఉంది. అలాగే కొత్త బంతితో పేసర్లు, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు ప్రభావం చూపవచ్చు. మంచు ప్రభావంతో ఇక్కడ టాస్ గెలిచిన జట్లు ఫీల్డింగ్‌కు మొగ్గుచూపాయి. అయినా చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఓడిన విషయం తెలిసిందే.



## రోహిత్ చెప్పిన వ్యక్తికే కెప్టెన్సీ!

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమై పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలిచిన ముంబై నుంచి ఇలాంటి ఆటతీరును ఫ్యాన్స్ ఆశించి ఉండరు. చాలా మంది స్టార్ ప్లేయర్లున్నా ముంబై జట్టుకు ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. అయితే, కెప్టెన్ హార్దిక్ పాండ్య తీరే ఇందుకు కారణమని ఫ్యాన్స్ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో వచ్చే సీజన్‌లో ముంబై ఇండియన్స్ సారథ్యం నుంచి హార్దిక్ వైదొలుగుతాడని వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా మరో అంశం నెట్టింట చక్కర్లు కొడుతోంది. రోహిత్ శర్మ చెప్పిన ప్లేయర్‌కే ముంబై కెప్టెన్సీ బాధ్యతలు దక్కే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. 'రోహిత్ శర్మ కెప్టెన్సీలో ముంబై ఇండియన్స్ 5 టైటిళ్లను సొంతం చేసుకుంది. కానీ, రెండేళ్ల క్రితం రోహిత్ వారసుడిగా హార్దిక్ పాండ్యను ముంబై యాజమాన్యం నియమించింది. ఇక అప్పటినుంచి ఎంఐ జట్టు పరిస్థితి దారుణంగా ఉంది. దీంతో వచ్చే సీజన్‌కు కొత్త సారథిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో చేసిన పొరపాట్లను ముంబై సరిచేసుకునే నిర్ణయం తీసుకోనుంది. రోహిత్ మళ్లీ సారథిగా రాడు. కానీ, కొత్త కెప్టెన్‌కు అతడి మద్దతు తప్పనిసరిగా ఉండాలి' అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. 'హార్దిక్ పాండ్య వచ్చే సీజన్‌లో జట్టు మారాలని భావిస్తున్నాడు. కేవలం సారథ్యమే కాకుండా.. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకోనున్నాడు. ఎవరైనా ఏదైనా కంపెనీలో మేనేజ్మెంట్‌తో మంచి వాతావరణం లేనప్పుడు ఏం చేస్తారు? ఇప్పుడు పాండ్య పరిస్థితి కూడా ఇంతే. కాబట్టి ముంబై ఇండియన్స్ కెప్టెన్ మార్పు జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి' అని ముంబై క్రికెట్ వర్గాలు తెలిపాయి.

## ఏం చేసి 'నీట్'ని సరిదిద్దాలి!?

**సమయం ప్రతినిధి :** ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న నిర్వహించాలని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) నిర్ణయించింది. నీట్ పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు 22,79,743 కాగా హాజరైనవారు 22,05,035 మంది (అంటే 96.92 శాతం). కొన్ని కారణాల వల్ల 75వేల మంది మే 3న పరీక్ష రాయలేకపోయారు. మరి ఇప్పుడు జూన్ 21న జరగబోయే పరీక్షకు ఈ 75వేల మందిలో కొందరు పరీక్ష రాయాలనుకొంటే రాయనివ్వాలిగదా. ఆనాడు విద్యార్థుల అశక్తత వలన రాయలేకపోతే, ఈసారి ప్రభుత్వ అసమర్థత వలన ఆ పరీక్ష రద్దయింది కాబట్టి ఈసారి వారికి అవకాశం కల్పించటం న్యాయం. జాతీయ పరీక్షల సంస్థ మొదటిసారి పరీక్ష నిర్వహణకు పెట్టిన ఖర్చంతా వృథా అవ్వడమే గాక, మళ్లీ పరీక్ష పెట్టేందుకు అదే మొత్తాన్ని రెండోసారి ఖర్చు చేయాలి. వృథా అయిన నిర్వహణ ఖర్చులు గాక దేశవ్యాప్తంగా నీట్ నిర్వహణకు సుమారు రూ.325 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో 13 ప్రధాన భాషలలో ప్రశ్న పత్రాల తయారీ ఉంటుంది. సుమారు 30 పుటలతో ఉన్న ప్రశ్నపత్రాలను 26 లక్షలకు పైగా ముద్రించాలి. మరో 26 లక్షలకు పైగా ఓఎంఆర్ షీట్లు ముద్రించాలి. 5,500కు పైగా పరీక్షా కేంద్రాలను దేశమంతటా విదేశాలలోనూ ఏర్పాటు చేయాలి. రెండు లక్షలమందికి పైగా పరిశీలకులను నియమించాలి. కట్టుదిట్టమైన భద్రతతో ప్రశ్నాపత్రాల రవాణా చేయాలి. ఇలాంటివెన్నో ఖర్చులు ఉంటాయి. మళ్లీ నిర్వహించబోయే పరీక్ష కోసం విద్యార్థుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయబోమని ప్రకటించినందున, ఈ రూ.325 కోట్ల అదనపు భారాన్ని చీూా తన అంతర్గత నిధుల నుంచే భరించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ఫీజుల ద్వారా సుమారు రూ.300కోట్ల ఆదాయం మాత్రమే వస్తుంది. అయితే, గతంలో చెల్లించిన ఫీజును విద్యార్థులకు రీఫండ్ చేస్తామని ఇటీవల ప్రకటించడంతో, సంస్థ ఒకేసారి రెట్టింపు ఖర్చులను ఎదుర్కోవాల్సి వస్తోంది. నేరస్తుల ముఠాలను వెదికి పట్టడానికి సీబీఐ వంటి సంస్థలను రంగంలోకి దించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు పరిపాలనాపరమైన భారం పడుతుంది. ప్రభుత్వానికి అయ్యే ఖర్చులను లెక్కించగలిగినప్పటికీ, 22 లక్షల మందికిపైగా విద్యార్థులూ వారి కుటుంబాలపై పడే పరోక్ష ఆర్థిక భారం అంతకంటే చాలా రెట్లు పెద్దది. మళ్లీ ఇంతమందికి ప్రయాణ వసతి ఖర్చులు ఉంటై. పరీక్షా కేంద్రాలకు దూరంగా ఉండే ఒక విద్యార్థి ప్రయాణానికి (రైలు/బస్సు ఛార్జీలు, స్థానిక రవాణా) ఇంకా రాత్రి వేళల్లో వసతి కోసం సగటున రూ.2,500 వరకు ఖర్చు చేయవలసివస్తుంది. 22లక్షల మందికి పైగా విద్యార్థులు రెండోసారి పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సి రావడం వల్ల దేశవ్యాప్తంగా దాదాపు రూ.560 కోట్ల వరకు ఉత్పాదకత లేని అదనపు ఖర్చు అవుతుంది. మళ్లీ పరీక్ష రాయడానికి మానసికంగా సిద్ధమవ్వాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, ఆందోళనలను వెలకట్టలేం.

# ఓటరు జాబితా సవరణకు జిల్లా యంత్రాంగం సిద్ధం





**డూప్లికేట్ ఓటర్లపై ప్రత్యేక పరిశీలన**
**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు లక్ష్యం**
**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్ కర్నూల్ జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్, జిల్లాలో చేపట్టనున్న ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ......, ఎన్నికల జాబితాల ఖచ్చితత్వం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అత్యంత కీలకమని , జిల్లాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలను కచ్చితత్వంతో నిర్వహించేందుకు దీూలు, సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింపు, డూప్లికేట్ నమోదుల పరిశీలన వంటి అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల వివరాల నవీకరణను సమయపాలనతో పూర్తి చేస్తామని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎన్నికల నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్ పై వచ్చే ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి సమయపాలనతో పరిష్కరించేలా చర్యలు ఉంటాయని, జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్, అర్డివోలు సురేష్ బాబు, బన్సిలాల్ , యాదగిరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, అన్ని మండలాల తహశీల్దార్లు , EROలు, AEROలు, దీూా సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


# అధికారంలోకి వచ్చిన తర్వాత.. పోయిన తర్వాత..

హైదరాబాద్ : రాజకీయ పార్టీల నాయకులు చేసే కామెంట్లకు ప్రాధాన్యం ఉంటుంది. అస్సలు ఇప్పటి వరకు అధికారంలోకి రాని పార్టీ ఏమైనా చెప్పినా.. ప్రజలు విశ్వసించేందుకు అవకాశం ఉంటుంది. కానీ.. పదేళ్లు, పదిహేనేళ్లు అధికారంలో ఉన్నవారు.. ప్రజలకు చెబుతున్న మాటలు.. ఇస్తున్న వాగ్దానాలను.. ఏమేరకు ప్రజలు విశ్వసిస్తున్నారన్నది సందహమే. తరచుగా మీడియాలోనూఎక్కువగా వినిపించే పేరు. ఇక్కడున్న సంక్లిష్ట రాజకీయాలే దీనికి కారణం. ఎందుకంటే.. నాయకుల కంటే ముందు.. నేడు సోషల్ మీడియా జనాల మధ్యకువెళ్లిపోతోంది. దీంతో ఒకసారి అధికారం వెలగబెట్టిన తర్వాత.. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు నాయకులు చేస్తున్న వాగ్దానాలపై జనాలు ఓ కన్నేసి ఉంచుతున్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయానికి కారణం.. ఇదే!. 15 ఏళ్లపాటు అధికారంలో ఉన్న మమతా బెనర్జీ.. మహిళలను గాలికి వదిలేశారు. కానీ, ఇటీవల ఎన్నికల్లో వారిని మెప్పించే ప్రయత్నం చేసి.. 1500 నెల నెలా ఇస్తామన్నారు. పేదరికాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తామన్నారు. కేంద్రం మెడలు వంచుతామన్నారు. కానీ, ప్రజలు నమ్మలేదు. దీనికి కారణం.. ఈ సూత్రమే తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్‌కు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే.. ఎంతైనా తెలంగా ణ ప్రజలు కూడా చైతన్యవంతులే కదా!!. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్‌కు రైతుల కష్టాలు కనిపించాయా? అంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో సచివాలయానికి కూత వేటు దూరంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిని నాడు సీఎం కేసీఆర్ ఎలా ట్రీట్ చేశారో తెలిసిందే. పోనీ.. ఇంటింటికీ నీటిని ఇచ్చారా? అంటే.. ప్రశ్నార్థకమే. నాడు అధికారంలో ఉన్నప్పుడు రైతులు, నీళ్లు, నియామకాలు.. వంటివి చిన్న సమస్యలుగా మారాయి. కేంద్రంలో చక్రం తిప్పడం, జాతీయ రాజకీయాలు చేయడం.. వంటివి 'పెద్దవి'గా మారాయి. కట్ చేస్తే.. ఇప్పుడు.. చరిత్ర మరిచిన బీఆర్ ఎస్.. ఇంటింటికీ 24 గంటలు నీటిని ఇస్తామని.. రైతులను కడుపులో పెట్టుకుంటామని చెబుతోంది. మంచిదే.. ఈ మార్పు కావాల్సిందే. కానీ.. ప్రజలు హర్షిస్తున్నారా? ఒక వేళజనాలు మరిచిపోయినా.. వారికి గుర్తు చేస్తున్న సోషల్ మీడియా ను ఎవరు తుడిచేయగలరు. సో.. చరిత్ర బోధ పడకపోతే.. ప్రజల సమస్యలు పట్టకపోతే.. ఇలానే ఉంటుంది. దీని నుంచి బీఆర్ ఎస్ పాఠాలు నేర్చుకుంటేనే.. భవిత ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ వర్సెస్ టిడిపి

హైదరాబాద్ : టిడిపి మీద వైసిపికి ద్వేషం ఉంటుంది. భారత రాష్ట్ర సమితికి కూడా కోపం ఉంటుంది. రాజకీయంగా ప్రత్యర్థి పార్టీలకు కచ్చితంగా విభేదాలు ఉంటాయి. దీనిని తప్పుగా చూడాల్సిన అవసరం లేదు. తప్పు పట్టాల్సిన అవసరం అంతకంటే లేదు. కానీ రాజకీయ పార్టీల మీద న్యూట్రల్ గా ఉండే విశ్లేషకులకు కోపం ఉండడమే ఇక్కడ అసలైన ఆశ్చర్యం.. ప్రభుత్వపరంగా.. పార్టీలపరంగా తప్పులు జరిగినప్పుడు విశ్లేషకులు వాటిని ఎత్తి చూపించాలి. అవసరమైతే వారు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను చెప్పగలగాలి. ఇవి న్యూట్రల్ కోణంలోనే ఉండాలి. అలాకాకుండా వ్యక్తిగత లక్ష్యాలకు అనుగుణంగా విమర్శలు చేస్తేనే విశ్లేషకుల అసలు రంగు బయటపడుతుంది. ఇప్పుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా తన అసలైన రంగును టిడిపి విషయంలో బయటపెట్టుకున్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటలకు.. ఏపీ పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించిన వ్యవహారం రాజకీయాలలో మంట పుట్టిస్తోంది.. దీనిని కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులు తెలంగాణ, ఆంధ్ర వివాదంగా మార్చారు. దీనిని ఆసరాగా చూపించి కొంతమంది కావాలని భావోద్వేగాలు రెచ్చగొట్టి. వాటి ద్వారా చలికాచుకోవాలని భావిస్తున్నారు. వారు మాట్లాడిన మాటలు.. చేస్తున్న ప్రకటనలు విద్వేషాలను రగిలించే విధంగా ఉన్నాయి. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటలు తప్పు.. వాటిని సమర్థించుకోవడం ఇంకా తప్పు.. పైగా వాటికి ఆంధ్ర తెలంగాణ సెంటిమెంట్ పూయడం మరింత పెద్ద తప్పు.అప్పట్లో వైసిపి పరిపాలన సాగుతున్నప్పుడు రాళ్ల మీద జగన్ తన బొమ్మలు వేసుకున్నాడు. దీనిని తప్పు అని టిడిపి నేతలు ప్రశ్నించారు. ఆ సమయంలో ఒక ఛానల్ లో డిబేట్ కు వెళ్లారు ప్రొఫెసర్ నాగేశ్వర్. ఆ సమయంలో ఆయన ఉల్టా వాదించడం మొదలుపెట్టారు. కరోనా సమయంలో సర్టిఫికెట్ లపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బొమ్మలు వేసుకున్నప్పుడు.. భూములకు పాతే రాళ్ల మీద జగన్ బొమ్మలు వేసుకుంటే తప్పు ఏంటి అని వాదించాడు. హద్దు రాళ్ల మీద బొమ్మలు.. కోవిడ్ సర్టిఫికెట్ మీద నరేంద్ర మోడీ ఫోటోలు ఒకే రకమైనవని ప్రొఫెసర్ నాగేశ్వర్ వాదించడం ఆయన మేధావితనానికి ఒక బలమైన నిదర్శనం. ఇంతకంటే ఎక్కువ దిగజారరు అనుకున్న ప్రతి సందర్భంలోనూ ఆయన దిగజారి నిరూపించుకుంటూనే ఉన్నారని టిడిపి నేతలు అంటున్నారు.నాడు జగన్ బొమ్మల మీద మాట్లాడిన ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద టిడిపి నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేశారు. దీనిపై ప్రొఫెసర్ నాగేశ్వర్ నారా లోకేష్ ను వ్యక్తిగతంగా కలిశారు.. సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఆపాలని లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. దానికి లోకేషన్ నుంచి సానుకూల స్పందన రాలేదని తెలుస్తోంది. అప్పట్నుంచి కడుపు మంటతో ప్రొఫెసర్ నాగేశ్వర్ రగిలిపోతున్నారు.. అందువల్లే టిడిపి మీద ఈ స్థాయిలో మండిపడుతున్నారు.ప్రత్యేక హోదా కంటే పెట్టుబడులు.. కేంద్రం ద్వారా వచ్చే నిధుల కోసమే చంద్రబాబు, నారా లోకేష్ పాటు పడుతున్నారు. ప్రత్యేక హోదా వచ్చే అవకాశం లేదని.. ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా అది సాధ్యం కాదని చంద్రబాబు.. లోకేష్ కు తెలుసు.. అందువల్లేవారు నిధుల కోసం.. పెట్టుబడుల కోసం తాపత్రయపడుతున్నారు.. అయితే ప్రత్యేక హోదా విషయాన్ని పదేపదే ప్రస్తావించి టిడిపిని ప్రొఫెసర్ నాగేశ్వర్ ఇబ్బంది పెడుతున్నారు.. అందువల్లే టిడిపి నాయకులు ఆయన మీద ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది.మరోవైపు రైల్వే జోన్ విషయంలో కూడా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటలు టిడిపికి ఇబ్బంది కలిగిస్తున్నాయి.. ఏపీకి రైల్వే జోన్ తెచ్చుకోవడం కష్టమైంది.. అది ఇచ్చిన సరే వేస్ట్ అని నాగేశ్వర్ అనడంతో టిడిపికి ఆ మాటలు ఇబ్బందికరంగా మారాయి. మరోవైపు పదేపదే కేంద్రాన్ని నిలదీయాలని టిడిపికి నాగేశ్వర్ పిలుపునివ్వడం.. దానిని వైసిపి నాయకులు తమ కొనుకూలంగా ప్రచారం చేసుకోవడం.. టిడిపిని ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడటంతో..”దేశం” నాయకుల్లో ఆగ్రహం కలిగిస్తోంది.తాజాగా నాగేశ్వర్ కు అనుకూలంగా హైదరాబాదులో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆవేశంగా మాట్లాడారు.. చంద్రబాబు నాయుడిని, పవన్ కళ్యాణ్ ను తెలంగాణలో అడుగుపెట్టనివ్వమని స్పష్టం చేశారు..“జనసేన అధినేతకు డెమోక్రసీ గురించి మాట్లాడే హక్కు లేదు. తెలంగాణ గురించి మాట్లాడే నైతికతలేదు. పూటకు ఒక రంగు మారుస్తాడు. చేగువేరా బొమ్మ పెట్టుకుని గద్దర్ వంటి నాయకుడిని మోసం చేస్తాడు. ఎన్టీఆర్ ను మోసం చేసి.. ఆయన చావు కారణమైన చంద్రబాబుకు సపోర్ట్ చేస్తాడు.. చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ జాగ్రత్త.. రజాకార్లను ఉరికించి కొట్టిన గడ్డ ఇది. మీ ఆస్తులు తగలబెట్టడమే కాదు.. మీ అస్తిత్వం కూడా లేకుండా చేస్తాం.. చంద్రబాబు హెరిటేజ్ ను నేటి నుంచి తెలంగాణలో లేకుండా నిషేధిస్తాం”.. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడిన మాటలు ఇవి.. ఇంకా చాలానే ఉన్నాయి.. ఇదంతా చూస్తుంటే ఓ పార్టీ మెప్పుకోసం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది.కొంత మంది జనసేన కార్యకర్తలు కేసులు పెట్టారు. అవేవో ఆంధ్రా ప్రభుత్వం పెట్టినట్లు నాగేశ్వర్ చెప్పడం, తనకు అనుకూల మేధావులు తో కూడా చెప్పించడం, దాన్ని ఎదుర్కోడానికి తనేదో వీరోచిత పోరాటం చేస్తున్నాను అనడం, ప్రాణం పోయినా ప్రశ్నిస్తూనే ఉంటాను లాంటి సినిమా డైలాగ్స్ చెప్పడం?. ఇదంతా తనను తను ఎక్కువగా చేసుక9దానికి చేస్తున్న ప్రయత్నాలు ఎబ్బెట్టుగా ఉన్నాయి.అసలు అరెస్టుల ప్రస్తావన తీసుకొచ్చిందే నాగేశ్వర్. తన శిష్యులు ఎవరో చెప్పారని తను మొదలెడితేనే ఈ అల్లరి అంతా జరుగుతోంది. అస్సలు అటువంటిదేమీ లేదని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చారు.

## శాంతినగర్-వడ్డేపల్లి రహదారిపై డ్రాప్ వద్ద చెత్త తొలగింపు పనులు పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ



**(సమయం ప్రతినిధి ఆలంపూర్):** వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ నుండి వడ్డేపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న డ్రాప్ వద్ద ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెత్త, మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు సక్రమంగా వెళ్లక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సమస్యను గుర్తించిన మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు వెంటనే మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ ని తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం జేసీబీ సహాయంతో డ్రాప్ వద్ద పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టించారు. ఈ సందర్భంగా చైర్మన్ మంజుల ధర్మ మాట్లాడుతూ, “వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన చర్యలు వేగంగా తీసుకుంటున్నాం” అని తెలిపారు. స్థానిక ప్రజలు సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారం చూపిన మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ కి, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## వికారాబాద్‌లో తెలంగాణా ఉద్యమ కారుల సమావేశం

**– హాజరైన ఉద్యమ కారులు**



**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో వికాస్ కళాశాల వద్ద గ్రౌండ్‌లో ఉద్యమ కారులు భేటీ అయ్యారు. ఉద్యమ కారులు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి అన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేశవరావు కమిటీ వెంటనే ఉద్యమ కారులు గుర్తింపు ఇవ్వాలి అన్ని వారు అన్నారు.250 గంజాలు స్థలం మరియు ఇతర బెనిఫిట్స్‌ల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణా ఉద్యమ కారుడు ఆర్ టీ ఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ మాట్లాడుతూ ఉద్యమకారుల కోసం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్దకు తెలంగాణ ఉద్యమకారుల తీసుకుపోతానని ఆయన. హామీ ఇచ్చారు జూన్ రెండో తారీఖున స్పీకర్ తో చర్చిస్తానని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ మెంబర్ పటేల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జేఏసీ నాయకులు శ్రీనివాస్. రవిశంకర్. మంచన్ పల్లి సురేష్. టైగర్ కృష్ణయ్య బాలరాజ్ నాయక్ కిందొడ్డి అంజయ్య శ్రీనివాస్ శివకుమార్. శాంత్ కుమార్.మారుతీ. గ్యాంగ్య నాయక్ ఉద్యమ కారులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆలస్యం లేకుండా సేవలు అందించాలి

**భూ భారతి, మ్యూటేషన్ కేసుల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం,**

**జనగణన ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలి**

**సంక్షేమ పథకాల అమలులో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి**

**రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి,**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ శాఖ అంశాలు, భూ భారతి, వరి--మొక్కజొన్న ధాన్యం కొనుగోలు, రవాణా సదుపాయాలు, జనగణన, కొత్త రేషన్ కార్డులు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, తదితర కీలక అంశాలపై సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,..... రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టాలని, రవాణా వాహనాల కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గన్ని బ్యాగులు, లారీలు ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం నిల్వల్లో ఆలస్యం జరిగితే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని, ప్రతి కొనుగోలు కేంద్రంలోని నిల్వ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా తడిసిన వరి ధాన్యం ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.జిల్లాలో కొనసాగుతున్న తొలి విడత ఇండ్ల సర్వేకు సంబంధించిన జనగణన ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. జనగణనలో పొరపాట్లు లేకుండా సిబ్బందికి తగిన అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జనగణన గణాంకాలు కీలకమని, ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, భూ వివాదాలు, భూ భారతి సమస్యలు, మ్యూటేషన్ కేసులు తదితర అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమయపాలనతో సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి ,రెవెన్యూ సదస్సులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, సాదాబైనామా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, మీసేవ ద్వారా వచ్చే దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సమయానికి రేషన్ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజావాణి, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రి కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులు, అలాగే హైకోర్టుకు సంబంధించిన కేసుల పరిష్కారాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతగా తీసుకుని సమయపాలనతో పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టి యు సి ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఉపాధి కూలీల ధర్నా



**(సమయం ప్రతినిధి వనపర్తి) :** అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉపాధి కూలీల సమస్యల సాధనకు ధర్నా చేసి వినతి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రసాద్ కార్యదర్శి చింతలన్న జిల్లా నాయకులు శ్రీనివాసులు గోపాల్ హనుమంతు లక్ష్మి వీరితోపాటు టి యు సి ఐ జిల్లా నాయకులు గణేష్ చెన్నయ్య తోపాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయలు కూలి చెల్లించాలని సంవత్సరంలో 210 రోజులు పని కల్పించాలని వారం వారం కూలీ ఇవ్వాలని 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని 12 వేల జీవనపుతిని ఇస్తూ వ్యవసాయ కూలీలకు కూడా వర్తింపజేయాలని ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లో నియమించాలని మేటి వ్యవస్థను పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

## ఏపీకి రాహుల్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పునర్వైభవం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం సరికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగంగా.. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ( త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించబోతున్నారనే వార్త పొలిటికల్ సర్కిల్స్‌లో కాక రేపుతోంది. రాహుల్ గాంధీ పర్యటనను పురస్కరించుకుని రాష్ట్రంలో ఒక భారీ బహిరంగ సభను నిర్వహించడానికి కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహాలు షురూ చేశాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, రాబోయే స్థానిక సంస్థల.. పంచాయతీ, మున్సిపల్, జెడ్పీటీసీ ఎన్నికలను కాంగ్రెస్ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలంటే గ్రామస్థాయి నుండి పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేయడమే ఏకైక మార్గమని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారు. రాహుల్ గాంధీ స్వయంగా రంగంలోకి దిగడం ద్వారా క్షేత్రస్థాయి నాయకులలో, కార్యకర్తలలో నూతన ఉత్తేజాన్ని నింపవచ్చని, తద్వారా స్థానిక ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వొచ్చని కాంగ్రెస్ గట్టి ప్లాన్ వేసింది.రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్న ప్రస్తుత తరుణాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085